క్లుప్తంగా

దుర్గాదేవి విగ్రహం ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్ పంచాయతీ పరిధిలోని జగ్యాతండాలో నిర్మించిన ఆలయంలో బుధవారం దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్, సత్యం గౌడ్, ప్రసాద్, లక్ష్మీనారాయణ, ఆనంద్, విఠల్, తండా గిరిజనులు గన్య, రాజు, భీమ్ సింగ్, సమీర్, సాకేత్ పాల్గొన్నారు.

మహిళ సమాఖ్య అధ్యక్షురాలిగా లత

మోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా బి.లతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ఏపీఎం పెంటాగౌడ్ ఆధ్వర్యంలో మండల సమాఖ్య ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షురాలిగా లత, కార్యదర్శిగా రాణి, కోశాధికారిగా సువార్త లాస్ఎంజైలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన



శిక్షణను పరిశీలిస్తున్న జిల్లా రిసోర్స్‌పర్సన్‌లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని బాలిక ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను జిల్లా రిసోర్స్ పర్సన్‌లు నరేందర్‌రెడ్డి, సంగమేశ్వర్ పరిశీలించారు. ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి అర్థమయ్యేలా బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రిసోర్స్‌పర్సన్‌లు ఎశెందర్‌రెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మట్టి తీయొద్దు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల చౌదరి చెరువులో మట్టి తీయవద్దని గ్రామసభ ద్వార తీర్మానం చేశారు. బుధవారం గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్లా ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా పొదల తొలగింపు, పూడికతీత పనులు చేసేందుకుగాను గ్రామసభను నిర్వహించారు. కాగా చౌదరి చెరువులో నుంచి మట్టి తీయవద్దని గ్రామస్తులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశం, మాజీ సర్పంచ్ నరహరి, గౌరిరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రమైన టేక్మాల్‌లో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ మీర్జా రహమత్ అలీబేగ్, జీహెచ్ఎంసీ కార్పొరేటర్ సరఫరాజ్ సిద్దిఖీ, ఆల్ ఇండియా జమాతుల్ మషాయాక్ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ నూరుల్లా హుస్సేనీలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దుర్గాలో చాదర్, పూలను సమర్పించినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా మైనారిటీ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి యం.ఏ సలీం తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ముక్తార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరప్ప, మాజీ ఎంపీటీసీ సిద్ధయ్య పాల్గొన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పథకం పను లు జరుగుతున్న చోట కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ దామోదర్ కోరారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పనిప్రదేశంలో నీడ, తాగునీటి సౌకర్యం, అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రాజ్‌కుమార్, ఎంపీఓ గిరిజా రాణి పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నిజాంపేట(మెదక్): రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఆయన మాట్లాడుతూ కేంద్రం నూతనంగా ప్రవేశపెట్టిన 11 అంకెల రైతు రిజిస్ట్రేషన్ భవిష్యత్‌లో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్ నంబర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు అందజేయాలని సూచించారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో బుధవారం శానిటరీ అధికారి శ్రీనివాస్ తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయొద్దని సూచించారు.

సమస్యల వలయంలో కాళ్లకల్

మేజర్ గ్రామ పంచాయతీలో నిర్వహణ అధ్వానం

- నివాస గృహాలతో విస్తరిస్తున్న గ్రామం
- వీధుల్లో దర్శనమిస్తున్న చెత్త కుప్పలు
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- పట్టించుకోని అధికారులు
- గ్రామస్తులకు తప్పని తిప్పలు



కాళ్లకల్ విస్తరిస్తున్న నివాస గృహాలు



రోడ్డు పక్కన పారబోసిన చెత్త

మనోహరాబాద్(తూప్రాన్): జిల్లాలోనే పారిశ్రామిక గ్రామం, మేజర్ పంచాయతీ అయిన కాళ్లకల్‌లో సమస్యలు తిష్ట వేశాయి. గ్రామంలో ఊహించిన దానికంటే నివాస గృహాలు పెరుగుతుండటంతో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటులో సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్యలు పరిష్కారం కావాలంటే అధికారులు గ్రామ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని పలువురు వాపోతున్నారు.

మనోహరాబాద్ మండలంలోని మేజర్ పంచాయతీ కాళ్లకల్ గ్రామం సమీపంలో పరిశ్రమలవాడలున్నాయి. దేశం నలుమూలల నుంచి కార్మికులు ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి పరిశ్రమల్లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. దీంతో గ్రామంలో ఉన్న జనాభా పెరుగుదలతో పాటు, కార్మికుల జనాభా సైతం అంచనాలకు మించి పెరుగుతోంది. దీంతో గ్రామ జనాభా అధికారుల అంచనా కంటే రెండింతలు అధికమైంది. అలాగే నూతన నివాస గృహాలు విరివిగా పెరుగుతూ విస్తరిస్తోంది. దీంతో మిషన్ భగీరథ నీటి సరఫరా, విద్యుత్, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ సమస్యగా మారింది. ఈ సమస్యలపై అధికారులు కసరత్తు చేసి నూతనంగా ప్రణాళికలు అంచనా వేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాళ్లకల్ జనాభా 10 వేలు

మేజర్ గ్రామ పంచాయతీలో 4936 మంది ఓటర్లు, 14 వార్డులున్నాయి. సిబ్బంది 26 మంది పని చేస్తున్నారు. ఒక ట్రాక్టర్, ఆటోతో చెత్త సేకరణ జరుగుతోంది. నాలుగు ఓహెచ్ఆర్ వాటర్ ట్యాంకులతో నీటిని సరఫరా చేస్తున్నారు. అవి సరిపోకపోవడంతో స్థానిక బోర్‌బావుల ద్వారా కూడా నీటిని అందిస్తున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు వాపోతున్నారు.

ప్రణాళికపై దృష్టి సారించాం



మేజర్ పంచాయతీగా ఉన్న కాళ్లకల్ గ్రామం 2011 జనాభా లెక్కల ప్రకారం 6 వేల జనాభాకు అనుగుణంగా వనరులు అందుతున్నాయి. కానీ అంచనాలకు మించి ప్రస్తుతం జనాభా సుమారు 20 వేల వరకు గ్రామంలో ఉంది. దీని వల్ల సమస్యలు పెరుగుతున్నాయి. ఈ సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి దృష్టి సారిస్తాం.

–కృష్ణమూర్తి, ఎంపీడీఓ

చెత్త సేకరణ చేస్తలేరు



గ్రామంలో చెత్త సేకరణ చేయడం లేదు. నిత్యం చెత్తను పలువురు వీధుల్లో, హనుమాన్ దేవాలయం వద్ద, ఎల్లారెడ్డి కుంట వద్ద, సుభాష్‌చంద్రబోస్ విగ్రహం దగ్గర, గానుగ బస్తీలో, ముప్పిరెడ్డిపల్లికి వెళ్లే దారిలో చెత్త పారబోస్తున్నారు. దీంతో సమస్యగా మారింది. అంతే కాకుండా అండర్ డ్రైనేజీల సమస్యలు పెరుగుతున్నాయి.

–గానుగు రాజు, కాళ్లకల్

రాజీవ్‌కు ఘన నివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

మెదక్‌జోన్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు ఎనలేనివని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కొనియాడారు. రాజీవ్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రావు, మాజీ కౌన్సిలర్లు లక్ష్మినారాయణ, దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి శ్రీనివాస్, గంగాధర్, హఫీజ్, శంకర్ తదితరులు ఉన్నారు.

పనికి తగిన వేతనం చెల్లించాలి

అదనపు ఆర్డీఓ రంగాచార్యులు

మనోహరబాద్(తూప్రాన్): ఉపాధి కూలీలకు పనికి తగిన వేతనం చెల్లించకుంటే కఠిన చర్యలు ఉంటాయని అదనపు ఆర్డీఓ రంగాచార్యులు తెలిపారు. బుధవారం మనోహరాబాద్‌లో 2024 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనికి తగిన వేతనం అందించలేదని ఆయా గ్రామాల నాయకులు వాపోయారు. అదనపు ఆర్డీఓ స్పందిస్తూ.. ఉపాధి హామీ సిబ్బంది పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి కూలీలకు న్యాయబద్ధంగా డబ్బులు చెల్లించాలని చెప్పారు. సిబ్బంది అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఆదినారాయణ, డీపీఓ శ్రీహరి, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మోతాదుకు మించి రసాయనాలు వాడొద్దు

రైతులకు శాస్త్రవేత్తల సూచన



రైతులకు కరపత్రాలు అందజేసిన దృశ్యం

నర్సాపూర్ రూరల్: మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ గీత, డాక్టర్ చైతన్య, డాక్టర్ గాయత్రి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని నైమతుల్లాగూడ, చిప్పల్ తుర్తిలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు వంట మార్పిడి, పచ్చి రొట్ట ఎరువుల వాడకం, వరి, పత్తి తదితర పంటల సస్యరక్షణ, సాగు యజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల సాగుతో కలిగే లాభాలను వివరించారు. అనంతరం ఆధునిక వ్యవసాయ పద్ధతుల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు చంద్రవేణి, తేజస్విని పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- రూ.12.90 లక్షల నిధులకు ప్రతిపాదనలు
- ఏడాదైనా మంజూరు కాని నిధులు
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు



లారీకి తగిలేలా ఉన్న విద్యుత్ తీగలు

రేగోడ్(మెదక్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నా కొందరు అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. దశాబ్దాల కాలంగా సమస్యను పరిష్కరించకపోవడంతో తరచూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. మండల కేంద్రం రేగోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయం నుంచి బీసీ కాలనీ వరకు విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. బీసీ కాలనీతో పాటు ఎస్సీ కాలనీలో కూడా విద్యుత్ తీగలు వేలాడుతుండటం వల్ల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బీసీ కాలనీ ప్రధాన రహదారి పక్కన తీగలన్నీ ప్రమాదకరంగా మారాయి. చిన్న వాహనం ఏదైనా లోడ్‌తో వెళితే తీగలు తగిలే అవకాశం ఉంది. ఇక్కడే గతంలో విద్యుత్ షాక్ తగిలి ఒకరు మృతిచెందగా, మరొకరు వికలాంగుడిగా మారాల్సిన దుస్థితి ఏర్పడింది. వరిగడ్డితో వెళ్తున్న ఒక వాహనానికి తీగలు తగిలి నిప్పంటుకుంది. తాజాగా గ్రంథాలయం భవన నిర్మాణం వద్ద విద్యుత్ షాక్ తగిలి ఒకరు గాయాలతో ఆస్పత్రి పాలైన విషయం తెలిసిందే. ఇలా తరచూ ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎవరైనా ప్రమాదాల బారిన పడితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

నిధులు మంజూరు కాలేదు

వేలాడుతున్న విద్యుత్ తీగలను షిఫ్టింగ్ చేసేందుకు రూ.12లక్షల 90వేలు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. తీగలు షిఫ్టింగ్‌కు అనుమతి వచ్చినా నిధులు ఇంకా మంజూరు కాలేదు. నిధులు రాగానే తీగలు తగలకుండా సరి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – యాసిన్ అలీ, ట్రాన్స్‌కో ఏఈ

ఏడాదైనా నిధులు మంజూరు కాలేదు..

బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసేందుకు స్థానిక ట్రాన్స్‌కో అధికారులు గత ఏడాది రూ.12లక్షల 90వేలు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారని తెలిసింది. తీగలు షిఫ్టింగ్ కోసం అనుమతి వచ్చినా నిధులు మంజూరు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. నిధులు మంజూరు ఆలస్యం కావడంతో తరచూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో రూ.80 లక్షల నిధులతో అంబేద్కర్ చౌక్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నారాగౌడ్, సంగమేశ్వర్, రోమాల సాయిలు తదితరులున్నారు.

కొత్త వారికి చాన్స్ ఇవ్వండి

కాంగ్రెస్ నేతల డిమాండ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని కొత్త వారికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. బుధవారం అల్లాదుర్గంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 15 ఏళ్లుగా ఒక్కరే పార్టీ అధ్యక్షుడి బాధ్యతలు నిర్వహిస్తున్నారని, పార్టీ కోసం నిరంతరం కృషి చేసిన వారిని గుర్తించాలని కోరారు. ఒకే కుటుంబానికి రెండు పదవులు ఉండటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తున్న నాయకులు నిరుత్సాహానికి గురవుతున్నట్లు చెప్పారు. నూతన కమిటీలో కొత్త వారిని, యువతకు అవకాశం ఇవ్వాలని కోరారు.

పని చేయని సీసీ కెమెరాలు



నిరుపయోగంగా సీసీ కెమెరాలు

హవేళీఘణాపూర్ (మెదక్): మండల కేంద్రమైన హవేళీఘణాపూర్ ప్రధాన చౌరస్తాలోని సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు. కానీ ప్రస్తుతం ఇవి పని చేయడం లేదు. కెమెరాల పునరుద్ధరణపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తడిసిన ధాన్యంతో తంటాలు



రామాయంపేటలో వర్షం నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం

అకాల వర్షాలతో రైతన్నకు కోలుకోలేని దెబ్బ తగులుతోంది. సకాలంలో లారీలు రాక.. ధాన్యాన్ని తూకం వేయకపోవడంతో వారికి కునుకు లేకుండా చేస్తోంది. ప్రస్తుతం అకాల వర్షాల వల్ల రైతుల ఇబ్బందులు వర్ణానాతీతం. తడిసిన ధాన్యం చూసి వారు తల్లడిల్లిపోతున్నారు. నీటిపాలు కాకుండా వారు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలుకు అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతన్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి హమాలీలను ఇతర కేంద్రానికి తీసుకెళ్లడంతో ఇక్కడ తూకం నిలిచిపోయిందని వర్షాలకు గాను ధాన్యం మొలకలు వచ్చాయని రైతులు వాపోయారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ధాన్యం కుప్పలు వర్షానికి తడిసిపోయాయి. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ధాన్యం తడవకుండా జాగ్రతలు తీసుకోవాలని రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. తడిసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వివరించారు.

ధాన్యం తరలింపునకు ఏర్పాట్లు

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తరలించేందుకుగాను అదనపు హమాలీలు అవసరమని, ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఉప తహసీల్దార్, షఫీయొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు సొంతంగా ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుంటే రైస్ మిల్లుల వద్ద తొందరగా ధాన్యం అన్‌లోడింగ్ జరిగేలా చర్యలు చేపట్టామన్నారు.

లారీలు రాక.. తూకం వేయక..

హవేళీఘణాపూర్(మెదక్): ఒకవైపు లారీలు రాక.. మరోవైపు తూకం వేయక ఇబ్బందులు పడుతున్న రైతులను అకాల వర్షం మరింత ఇబ్బందులకు గురి చేస్తోంది. రెండు, మూడు రోజులుగా లారీలు రాలేదు. అయితే.. బుధవారం వచ్చినప్పటికీ వర్షంతో ధాన్యం తూకం వేసేందుకు వీలులేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అల్లాదుర్గం(మెదక్): వర్షాలు కురుస్తుండడంతో ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపిస్తున్నట్లు తహసీల్దార్ మల్లయ్య చెప్పారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి, కాయిదంపల్లి, ముస్లాపూర్ గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రెడ్డిపల్లి, కాయిదంపల్లి కొనుగోలు కేంద్రాల నుంచి రెండు లారీల ధాన్యం మిల్లుకు పంపించామన్నారు. రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ధాన్యం పరిశీలించిన తహసీల్దార్

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట, గవ్వలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని తహసీల్దార్ మన్నన్ పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా హమాలీలను పెంచాలని సూచించారు. రెండు మూడు రోజులలో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని ఆదేశించారు.

రామాయంపేట.. టేక్మాల్‌లో..

రామాయంపేట(మెదక్)/టేక్మాల్: రామాయంపేటలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఈదురుగాలులతో ప్రారంభమై గంటకుపైగా దంచికొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, ప్రధాన రహదార్లపై వరద నీరు పోటెత్తింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మార్కెట్ కమిటీ ఆవరణలో ధాన్యం తడిసి ముద్దయింది. రోడ్డుపై ఆరబోసిన వడ్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి. అక్కన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. ప్రభుత్వం తడిసిన ధాన్యా న్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. అలాగే టేక్మాల్ మండలంలోని దాదాయిపల్లి, కుసంగి, బొడ్మట్‌పల్లి, బర్దిపూర్ తదితర గ్రామా ల్లో వాన దంచికొట్టింది. 161 హైవేపై రైతులు ఆరబోసిన వడ్లు వర్షానికి కొట్టుకుపోయాయి.



హవేళిఘనపురం: తూకం సాగక తరగని ధాన్యం కుప్పలు



శివ్వంపేట: మొలకలు వచ్చిన ధాన్యం చూపుతున్న రైతులు